సాక్షి
కాకినాడ

శనివారం । 21 । జనవరి । 2023



మడ అడవుల సంరక్షణ


పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో దోహదప డుతున్న మడ అడవుల సంరక్షణ మనందరి బాధ్యత అని ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. - IIలో▸



కొనసాగుతున్న విన్యాసాలు

కాకినాడ తీరంలో నేవీ, ఆర్మీ ప్రారంభమైన విన్యాసాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ ఇలక్కియా తదితరులు వెళ్లి పరిశీలించారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలు వలకు శుక్రవారం 9,450 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,850, మధ్య డెల్టాకు 1,800, పశ్చిమ డెల్టాకు 4,800 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 7.55 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

గణతంత్ర దిన వేడుకలకు ఏర్పాట్లు



గణతంత్ర దినోత్సవ వేడుకలపై నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: గణతంత్ర దిన వేడుకల్లో ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఆకర్షణీయ మైన శకటాలను ప్రదర్శించాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. శుక్ర వారం కలెక్టరేట్ కోర్టు హాలులో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించేందుకు ప్రతిపాదనలను వెం టనే సమర్పించాలన్నారు. పోలీస్ పరేడ్ మైదానం వేదికల సుందరీకరణపై సూచనలు జారీ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల ఎంపి కను పరిశీలించారు. అన్ని శాఖల సమన్వయం తో వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డి, ఏఎస్పీ బి.సత్యనారాయణ, కాకినాడ ఆర్డీవో బీవీ రమణ, జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారా యణ, డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ పరీక్ష అభ్యర్థులకు సూచనలు

కాకినాడ క్రైం: ఆదివారం జరగనున్న కానిస్టే బుల్ పరీక్షల నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్టు జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 59 కేంద్రాల్లో జరగనున్న ప్రాథమిక రాత పరీక్ష లకు 30,272 మంది హాజరుకానున్నారన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కొనసాగే పరీక్షకు ఉదయం 9 గంటల నుంచి పరీక్ష హాలులోకి అనుమతిస్తామన్నారు. నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతి ఇచ్చేది లేదన్నారు. తనిఖీ అనంతరం పరీక్ష హాలులోకి అనుమతి ఇస్తామన్నారు. ప్రతి అభ్యర్థి హాల్ టికెట్‌తో పాటు ఫొటో ఐడీ కార్డును కలిగి వుం డాలని, బ్లూ, బ్లాక్ బాల్‌పెన్‌లతోనే పరీక్ష రాయాలని సూచించారు. మొబైల్స్, డిజిటల్ వాచ్‌లు, గ్యాడ్జెట్లకు ఎటువంటి అనుమతి లేద న్నారు. అభ్యర్థుల సౌలభ్యం కోసం జిల్లాలో అన్ని ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయించామని, సద్వినియోగం చేసు కోవాలన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూయలేదు

కాకినాడ సిటీ: ధాన్యం కేంద్రాలను మూసివే యలేదని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ శనివారం స్పష్టం చేశారు. రైతుల వద్ద ఇంకా ధాన్యం నిల్వలు ఉంటే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విష యంలో అధైర్యపడవద్దని రైతులకు సూచిం చారు. ఎవరైనా ధాన్యం అమ్మదలిస్తే సమీపం లోని రైతు భరోసా కేంద్రాల వద్ద సంప్రదిం చవచ్చన్నారు. జిల్లాలోని 51,519 మంది రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి రూ.466.61 కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో ఆన్‌లైన్ ద్వారా జమ చేశామన్నారు. ఇప్పటి వరకు 2,44,241.040 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు వివరించారు.

గోదావరిలో దూకి దంపతుల ఆత్మహత్య

కొవ్వూరు: ఎవరి వల్ల ఏ కష్టమొచ్చిందో, తెలియదుగాని వృద్ధ దంపతులు గోదావరిలోకి దూకి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఏలూరు జిల్లా ఏలూరు నగరానికి చెందిన కేదారి కొండల రావు (65), ఆయన భార్య ఉమా మల్లేశ్వరి (55) తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులోని గోష్పాద క్షేత్రం వద్ద గోదావరి నదిలో శుక్రవారం ఉదయం విగత జీవులుగా తేలియాడుతూ కనిపించారు. దీనిపై స్థానికులు పోలీసులకు సమాచారం అం దించారు. ఆ మృతదేహాలను పోలీసులు వెలికి తీసి పోస్టుమార్టానికి కొవ్వూరు ప్రభుత్వ సామా జిక ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలంలో లభించిన పెన్షనర్స్ అసోసియేషన్ కార్డు ఆధారం గా మృతదేహాలను గుర్తించినట్టు కొవ్వూరు పట్టణ సీఐ ఏఎల్‌ఎస్ రవికుమార్ తెలిపారు. మృ తుడు కొండలరావు ఆంధ్రాబ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. భార్య ఉమామల్లేశ్వరి గృహిణి. ఈ దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహమై ప్రస్తుతం అమెరికాలో స్థిరపడినట్టు మృతుల కుటుంబ సభ్యులు తెలిపారు. కుమారు డికి ఇంకా వివాహం కాలేదు. అతని వల్లే ఈ దం పతులు ఇబ్బందులు ఎదుర్కొన్నట్టు తెలియ వచ్చింది. ఆ దంపతులు గురువారం ఏలూరులోని ఇంటి నుంచి బయలుదేరినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల వారు ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని భావిస్తున్నట్లు మృతుడికి వరుసకు సోదరుడైన వెంకటరమణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆర్టీసీకి పండగే పండగ

సంక్రాంతి ముందు ఈనెల 9నుంచి ఆదాయం (రూ.లలో)

జిల్లా	స్పెషల్స్	ప్రయాణికులు	దూరం (కి.మీ)	రాబడి
కాకినాడ	71	6,000	58,972	21,03,147
కోనసీమ	101	7,790	85,990	30,88,783
తూర్పుగోదావరి	118	8,498	82,657	28,00,000

సంక్రాంతి తిరుగు ప్రయాణం ఆదాయం (రూ.లలో)

జిల్లా	స్పెషల్స్	ప్రయాణికులు	దూరం (కి.మీ)	రాబడి
కాకినాడ	61	8,552	35,440	14,38,466
కోనసీమ	69	6,883	70,036	25,70,717
తూర్పుగోదావరి	71	5,680	44,569	16,50,000



తిరుగు ప్రయాణంలో ఇలా..

- కోవిడ్ తర్వాత సంక్రాంతికి భారీగా ప్రయాణికులు
- సాధారణ చార్జీల వసూలుతో పెరిగిన ఆదరణ
- ప్రభుత్వ నిర్ణయంతో సమకూరిన ఆదాయం
- అధికారులు, సిబ్బందిలో కనిపిస్తున్న ఆనందం



సీటు కోసం ఆత్రుత

సాక్షిప్రతినిధి, కాకినాడ: ఆర్టీసీ గేర్ మార్చి స్పీడ్ పెం చింది. ఫలితంగా సంక్రాంతి పండగ బాగా కలిసి వచ్చింది. నష్టాల నుంచి కోలుకుని లాభాలతో రోడ్డెక్కింది. సాధారణ టికెట్ చార్జీలతో క్షేమంగా గమ్య స్థానాలు చేర్చే ఆర్టీసీ బస్సు వైపే ఈసారి పం డగ ప్రయాణికులు అడుగులు వేశారు. రెండేళ్ల పాటు కోవిడ్–19 పరిస్థితులతో సంక్రాంతి పండగకు బంధు గణం స్వస్థలాలకు రావడానికి అంతగా మక్కువ చూపలేదు. ఇళ్లకు పరిమితమయ్యారు. అందుకే గడ చిన రెండేళ్లూ సంక్రాంతి పండగ వేళ పెద్దగా ప్రయాణాలు సాగలేదు. వచ్చిన కొద్దిమంది కూడా సొంత వాహనాల్లో వచ్చి వెళ్లిపోయారు.

స్పెషల్ బాదుడు లేదు

రెండేళ్ల తరువాత కోవిడ్ విపత్కర పరిస్థితి నుంచి పూర్తిగా ఉపశమనం లభించింది. దీంతో సంక్రాంతి పండగకు వేలాదిగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు తరలివచ్చారు. ఆరు రోజులు ముందు వచ్చి, నాలుగు రోజుల తరువాత తిరిగి వెళ్లిన ప్రయాణికులు ఈ సారి ఆర్టీసీని బాగా ఆదరించారు. ఇందుకు ప్రభుత్వం తీసు కున్న కీలక నిర్ణయం సంస్థకు బాగా అనుకూలించిం ది. గతంలో పండగలప్పుడు స్పెషల్ సర్వీసులలో ప్రయాణికుల టిక్కెట్లపై 1.5 శాతం అదనపు చార్జీలు విధించే వారు. ప్రభుత్వం ఈసారి అదనపు చార్జీలను పూర్తిగా రద్దు చేసింది. ఇందుకు సురక్షితమైన ప్రయాణానికి ఆర్టీసీయే మేలనే ప్రజల నమ్మకం కూడా తోడైంది. ప్రైవేటు ట్రావెల్స్..ప్రయాణికుల అవసరాన్ని బట్టి టిక్కెట్ చార్జీలను హైదరాబాద్ వం టి ప్రాంతాలకు రూ.2,000 నుంచి రూ.3,000 వం తున ముక్కుపిండి మరీ వసూలు చేశాయి. ప్రభుత్వ ఆదేశాలతో రవాణా శాఖాధికారులు ఆకస్మికంగా తనిఖీ చేసి కొంతమేర అడ్డగోలు దోపిడీని నియంత్రిం చగలిగారని చెప్పొచ్చు.

ఈసారి భారీగా రాకపోకలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలకు చెందినవారు హైద రాబాద్, బెంగళూరు, చెన్నై వంటి ప్రాంతాల్లో స్థిరప డ్డారు. వారిలో ఎక్కువగా హైదరాబాద్ పరిసర ప్రాం తాల్లోనే ఉన్నారు. రాష్ట్ర విభజనకు ముందు నుంచి హైదరాబాద్ నగరంలోనే ఇక్కడి వారు ఉద్యోగ, వ్యాపార రంగాల్లో స్థిరపడ్డారు. అటువంటి వారంతా మిగిలిన రోజుల మాటెలా ఉన్నా సంక్రాంతి పండగ మూడు రోజులు మాత్రం స్వస్థలాలకు కుటుంబ సమే తంగా వస్తుంటారు. వేడుకల్లో పాల్గొంటారు. ఏటా ఇది ఆనవాయితీగా వస్తోంది. అరమరికలు, మనస్పర్థలు ఉన్నా ఈ సంక్రాంతికి మాత్రం ఉమ్మడి తూర్పులోని అన్ని సామాజికవర్గాల కుటుంబాలూ ఒకచోట కలిసి ఆత్మీయతలు కలబోసుకున్నాయి. అనురాగాల మధ్య వేడుకలు జరుపుకున్నాయి. దూర ప్రాంతాల నుంచి 50 వేల మందికి పైగానే ఆర్టీసీ బస్సులలో జిల్లాలకు చేరు కున్నారని అంచనా. విమానయానం, రైల్వే, ప్రైవేటు ట్రావెల్ సర్వీసులు, వ్యక్తిగత వాహనాల్లో ప్రయాణిం చిన వారు 40 వేల వరకు ఉంటారని భావిస్తున్నారు. సంక్రాంతి పండగకు ముందు ఈ నెల 9వ తేదీ నుంచి కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలకు రావడం మొదలుపెట్టిన ప్రయాణికులు కనుమ నుంచి 19 వరకు తిరుగు ప్రయాణం చేశారు. చాలా కుటుం బాల్లో బంధువులు, ఆడపడుచులు పుట్టింటి నుంచి శుక్రవారం సెంటిమెంట్‌గా తిరిగి వెళ్లారు. ఈ నేపథ్యం లో శుక్రవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆర్టీసీ డిపోలలో ప్రయాణికులు పలుచగా కనిపించారు. తిరిగి ఆదివారం ప్రయాణాలు మొదలయ్యే అవకాశముందని ఆర్టీసీ ఆశలు పెట్టుకుంది.

ఆదరణ బాగుంది



సంక్రాంతి పండగ ఆర్టీసీకి కలిసొచ్చింది. ప్రైవేటు ట్రావె ల్స్‌లో అధిక చార్జీలతో ప్రయాణికులు ఆర్టీసీ బస్సు ల్లో ప్రయాణించేందుకు ముందుకు వచ్చారు. సంక్రాంతికి ముందు, సం క్రాంతి తరువాత కూడా ఒకే రకంగా ప్రయాణిం చారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం అంటేనే సురక్షితం కావడంతో మా సంస్థకు ఆదరణ పెరి గింది. ఆక్యుపెన్సీ రేషియో కూడా బాగా పెరిగింది. కిలోమీటరుకు వచ్చే ఆదాయం కూడా పెరగడం సంతోషాన్నిచ్చింది.

- ఎం.శ్రీనివాసరావు, జిల్లా ప్రజారవాణ అధికారి, కాకినాడ

చిన్నారికి సీఎం జగన్ ఆపన్న హస్తం

- వైద్యానికి రూ.14 లక్షలకు ఎల్‌వోసీ
- ద్వారంపూడి చొరవపై కుటుంబం ఆనందం



ఎల్‌వోసీని అందజేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: జన్యువరమైన సమస్యతో బాధ పడుతున్న రెండేళ్ల చిన్నారి వైద్యానికి అవసర మైన రూ.14 లక్షల ఎల్‌ఓసీ అందజేసి సీఎం జగన్ ఆ కుటుంబానికి ఆరాధ్యుడయ్యారు. కాకినాడ రాగంపేట ప్రాంతానికి చెందిన మెకానిక్ రాజేష్–మీనా దంపతుల రెండేళ్ల కుమారుడు పప్పు యశ్వంత్ జన్యు సమ స్యతో ఇబ్బంది పడుతున్నాడు. ప్రాణాంత కంగా పరిణమించిన ఈ వ్యాధి గురించి ఆ కుటుంబం ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశే ఖరరెడ్డిని ఆశ్రయించి హైదరాబాద్‌లోని సిటిజన్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులను సం ప్రదించారు. వైద్యులు రూ.14 లక్షల ఖర్చు అవుతుందని తేల్చడంతో ఎమ్మెల్యే ఈ విష యాన్ని సీఎం జగన్‌కు వివరించారు. దీనిపై స్పందించిన సీఎం వైద్యం కోసం అవస రమైన రూ.14 లక్షలను సీఎం సహాయ నిధి నుంచి అందించేందుకు నిర్ణయం తీసుకు న్నారు. ఆ మేరకు ఎల్‌వోసీ విడుదల చేశారు. ఆ లేఖను శుక్రవారం ఎమ్మెల్యే ద్వారంపూడి చిన్నారి యశ్వంత్ కుటుంబానికి అంద జేశారు. యశ్వంత్ తల్లిదండ్రులు మాట్లా డుతూ ఎమ్మెల్యే ద్వారంపూడి చొరవతో తమకు సీఎం జగన్ ఎంతో న్యాయం చేశారని సంతోషంగా తెలిపారు. ఆ లేఖతో వైద్యం చేయించి తమ చిన్నారి సంపూర్ణ ఆరోగ్యంతో ఉండేలా త్వరలోనే చికిత్స అందిస్తామ న్నారు. ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి మాట్లా డుతూ అడిగిన వెంటనే చిన్నారిని ఆదుకుని ఎల్‌వోసీ ఇచ్చిన సీఎంకు ధన్యవాదాలు చెప్పారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రక ళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, వైఎ స్సార్ సీపీ మహిళా నాయకురాలు కృ ష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు.

అయ్యన్న వ్యాఖ్యలపై పోలీస్ అధికారుల ఖండన

కాకినాడ క్రైం: రాజకీయ ప్రయోజనాల దృ ష్ట్యా పోలీసులపై టీడీపీ మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు చేసిన అనుచిత వ్యాఖ్య లను ఆంధ్రప్రదేశ్ పోలీస్ ఆఫీసర్స్ అసోసి యేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా విభాగం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు శుక్రవారం అధ్యక్షుడు సత్యంమూ ర్తి ఒక ప్రకటన విడుదల చేశారు. అయ్య న్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు అత్యంత హేయమైనవన్నారు. రాజకీయ ప్రయోజ నాల దృష్ట్యా అధినేత మెప్పు కోసం ఇటు వంటి వ్యాఖ్యలు చేయడం ఏ మాత్రం సరి కాదని హితవు పలికారు. ఎన్నిసార్లు చెబుతున్నా అయ్యన్న వ్యవహారశైలిలో ఏ మాత్రం మార్పు రావడం లేదన్నారు. ఇదే తరహా ప్రవర్తన కొనసాగితే తీవ్ర పరిణా మాలు ఉంటాయని హెచ్చరించారు. అయ్యన్న వ్యాఖ్యలపై ప్రభుత్వం స్పందిం చి తక్షణమే చర్యలకు ఉపక్రమించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఫేషియల్ హాజరులో ఇబ్బందులు తొలగిస్తాం

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): దేవదాయశాఖ లో ఈఓలకు ఫేషియల్ హాజరులో ఇబ్బం దులను తొలగిస్తామని ఆ శాఖ కమిషనర్ డాక్టర్ హరిజవహర్‌లాల్ తెలిపారు. శుక్ర వారం జిల్లాలోని దేవదాయశాఖ అధికారు లతో ఆయన విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రస్తుతం ఈఓలు ఆయా దేవదాయశాఖ పరిధిలోని కార్యాలయాలకు వచ్చి ఫేషియల్ హాజరు వేయడం ఇబ్బందిగా ఉన్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈఓలు ఆయా దేవాలయాల్లో హాజరు వేసే విధంగా మార్పులు చేస్తామన్నారు. అనంతరం వివిధ దేవాలయాల్లో జరుగుతున్న నిర్మా ణాల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఫిబ్రవరిలో ప్రముఖ ఆలయాల్లో జరిగే ఉత్సవాలు, రథోత్సవాలు భక్తులకు కల్పిం చే సౌకర్యాలపై సమీక్షించారు. డీసీఎం విజ యరాజు, జిల్లా దేవదాయశాఖ అధికారి పులి నారాయణమూర్తి, దేవదాయశాఖ తనిఖీదారులు ఫణికుమార్, ఈఓలు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్లపై విజిలెన్స్ తనిఖీలు

రెండు వాటర్ ప్లాంట్లు సీజ్

కిర్లంపూడి: గెద్దానాపల్లిలోని శ్రీలలితా వాటర్ ప్లాం ట్‌పై విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఆకస్మిక తని ఖీలు నిర్వహించారు. ఎటువంటి అనుమతులు లేకుండా వాటర్ ప్యాకింగ్ చేస్తున్నట్టు విజిలెన్స్ అధి కారుల ధ్రువీకరించి వాటర్ ప్లాంట్‌ను స్థానిక తహసీల్దార్ కేవీ మాధవరావు సమక్షంలో సీజ్ చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ సీఐ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని వాటర్ ప్లాంట్లలో తనిఖీలు చేస్తున్నామన్నారు. గెద్దానాపల్లిలో అనుమతులు లేకుండా శ్రీలలితా వాటర్ ప్లాంట్‌ను నిర్వహి స్తున్నట్లు ఫిర్యాదు రావడంతో తనిఖీ చేశామన్నారు. లైసెన్స్ లేకుండా ఈ వాటర్ ప్లాంట్‌ను నిర్వహించ డంతో పాటు అనధికారికంగా వాటర్ ప్యాకింగ్ చేస్తున్నారన్నారు. 200 మిల్లీ లీటర్ల సామర్థ్యం ఉన్న 85 ప్యాకింగ్ గల 60 వాటర్ బస్తాలను గుర్తించామ న్నారు. ప్లాంట్‌లోని వాటర్ నమూనాలను కాకినాడ పరిశోధన కేంద్రానికి తీసుకు వెళుతున్నట్టు జిల్లా ఆహార నిరోధక శాఖ అధికారి షేక్ నాగూల్‌మీర తెలిపారు. ప్లాంట్ నిర్వాహకులపై రెండు కేసులు నమోదు చేసినట్లు లీగల్ మెట్రాలజీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎం .శ్రీనివాసరావు, వీఆర్‌ఓ పడాల సత్యకుమార్, సెక్ర టరీ ఎం.విజయ్‌కుమార్, మహిళా పోలీస్ మీనాక్షి, సచివాలయం సెక్రటరీ సౌజన్య, వలంటీర్ దడాల రాజబాబు తదితరులు పాల్గొన్నారు.



వాటర్ ప్యాకెట్లను తనిఖీ చేస్తున్న అధికారులు



గోకవరం మండలం కృష్ణునిపాలెంలో వాటర్ ప్లాంట్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు

గోకవరం: మండలంలోని కృష్ణునిపాలెం విజయలక్ష్మి వాటర్ ప్లాంట్‌పై శుక్రవారం విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ, రెవెన్యూ శాఖ, లీగల్ మెట్రాలజీ అధికారులు సం యుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ వాటర్ ప్లాం ట్‌లో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ ప్రమాణాల ప్రకారం తాగునీటిని సురక్షితంగా ప్యాకింగ్ చేస్తున్నారా అని పరిశీలించారు. వాటర్ ప్లాంట్‌కు లైసెన్స్ లేకపోవడాన్ని గుర్తించారు. వాటర్ ప్యాకెట్లపై మేండేటరీ డిక్లరేషన్ లేకపోవడంపై లీగల్ మెట్రాలజీ అధికారులు రెండు కేసులు నమోదు చేశారు. ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన లైసెన్సులు లేకపోవడంతో రెవెన్యూ అధికారులు ప్లాంట్‌ను సీజ్ చేశారు. ఈ సం దర్భంగా రాజమహేంద్రవరం విజిలెన్స్ ఎస్పీ పీవీ రవికుమార్ మాట్లాడుతూ వాటర్ ప్లాంట్‌లో నాణ్యతా ప్రమాణాలు పాటించడంలేదని ఫిర్యాదులు రావడంతో రాజమహేంద్రవరం యూనిట్ పరిధిలోని మూడు జిల్లాల్లో పలు వాటర్ ప్లాంట్లను ఆకస్మికంగా తనిఖీ చేశామన్నారు. పలు ప్లాంట్లను బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ ప్రమా ణాల మేరకు నిర్వహించడం లేదన్నారు. ఇటువంటి ప్లాంట్లలో నీటిని తాగడం ద్వారా ప్రజలు అనారోగ్యా నికి గురయ్యే అవకాశం ఉందన్నారు. వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రికెట్ ఆడుదాం.. ప్రతిభ చాటుదాం

ఈ నెల 22 సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉం దా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటే యాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాట ర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మన సులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్ల తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసిం ది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి. ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవ ర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధ తిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండ ర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉం డాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్‌ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజినీ రింగ్, ఫార్మా కాలేజీల జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పం పించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమ యంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమ యంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబరు 9912220345

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

క్రమశిక్షణతో ఉన్నత పథం

ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చనడానికి మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం నిదర్శ నమని ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వర రావు పేర్కొన్నారు. స్థానిక సూర్య కళామందిరం లో శుక్రవారం సాయంత్రం లయన్స్ క్లబ్ కాకి నాడ అధ్యక్షుడు నేరేళ్ల మురళీకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులు–క్రమశిక్షణ అనే అంశంపై ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకుంటే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. సమయానికి ప్రాధా న్యత ఇవ్వాలని హితవు పలికారు. ఆహారపు అలవాట్లు, సంస్కృతి సంప్రదాయాలకు విలువ ఇవ్వాలన్నారు. కష్టపడి సాధించిన ఫలితంలో మాధుర్యం ఉంటుందన్నారు. భావోద్వేగం ఆసరాగా కోట్ల రూపాయల వ్యాపారం జరుగు తోందన్నారు. అధునాతన సాంకేతికతో అభివృ ద్ధి సాధించాలే గాని తద్వారా బానిసలై చిన్నవ యస్సులో జీవితాలు అర్ధాంతరంగా ముగించరా దన్నారు. లయన్స్ జిల్లా పూర్వపు గవర్నర్ ఎం. మంగతాయారు, డాక్టర్ బాదం బాలకృష్ణ, ఎం. విశ్వేశ్వరరావు, ప్రోగ్రాం ఆర్గనైజింగ్ చైర్మన్ ఏం వీఆర్ మోహన్‌కుమార్, మేడిశెట్టి వెంకటరమణ, క్లబ్ కార్యదర్శి రామసుబ్రమ్మణ్యం, దంగేటి సతీష్, కోశాధికారి సత్యనారాయణ, మధు మోహన్, కృష్ణమూర్తి, సుబ్బారావుతో పాటు వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులు–క్రమశిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆధ్యాత్మిక వేత్త చాగంటి కోటేశ్వరరావు



హాజరైన విద్యార్థులు, క్లబ్ సభ్యులు

మడ అడవుల సంరక్షణ అందరి బాధ్యత

ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని

తాళ్లరేవు: పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో దోహదపడుతున్న మడ అడవుల సంరక్షణ మనందరి బాధ్యత అని ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన తాళ్లరేవు మండలంలో పర్యటించారు. ఆయన తొలుత చొల్లంగిలోని కోరంగి అభయారణ్యాన్ని సందర్శించారు. అనంతరం కోరంగి ఫారెస్ట్ కాంప్లెక్స్‌లో ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి కొమ్మినేని ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

మడ అడవుల సంరక్షణ–సామాజిక బాధ్యత–మీడియా పాత్ర, జర్నలిజం మౌలిక సూత్రాలు, విలువలు తదితర అంశాలపై ఏపీ ప్రెస్ అకాడమీ, అటవీ శాఖ సంయుక్తంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మడ అడవులు పర్యావరణ పరిరక్షణకు తోడ్పడంతోపాటు ఎన్నో జీవులకు ఆవాసంగా ఉన్నాయన్నారు. తుపానులు, సునామీల వంటి ప్రకృతి వైపరీత్యాల నుంచి కాపాడుతూ తీర ప్రాంతానికి రక్షణ కవచంగా ఉన్న మడ అడవులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కోరంగి అభయారణ్యం గురించి ప్రముఖ నగరాలకు, ఇతర రాష్ట్రాలకు తెలియజేస్తే వేలాది మంది పర్యాటకులు తరలివచ్చే అవకాశం ఉందన్నారు.

మడ అడవుల సంరక్షణే...
భవిష్యత్ తరాలకు ఇచ్చే ఆస్తి

మానవాళికి ఎంతో మేలు చేస్తున్న మడ అడవుల సంరక్షణే మనం భవిష్యత్తు తరాలకు ఇచ్చే ఆస్తి అని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. అభయారణ్యం, హోప్ ఐలాండ్‌లు మన ప్రాంతానికి ఒక అదృష్టమన్నారు. ప్రకృతి సిద్ధంగా ఏర్పడి ఎన్నో వైపరీత్యాల నుంచి ఇక్కడి ప్రజలను కాపాడుతున్న వీటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కోరంగి అభయారణ్యాన్ని ప్రత్యేక ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేయాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దృష్టికి తీసుకువెళ్లామని ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. గతంలో కేంద్ర పర్యాటక మంత్రిగా పనిచేసిన చిరంజీవి రూ.6 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. మడ అడవులకు నష్టం కలుగకుండా ఎకో టూరిజంగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం, ఆక్వా కల్చర్ కారణంగా మడ అడవులకు నష్టం కలుగుతుందని, అరుదైన మత్స్య జాతులు అంతరించిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు. వీటి సంరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. జర్నలిజంలో విలువలు లోపిస్తున్నాయని, జర్నలిస్టులు సంచలనమైన వార్తలే కాకుండా పరిశీలనాత్మకమైన వార్తలు కూడా రాయాలని పిలుపునిచ్చారు.

యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్ మాట్లాడుతూ మడ అడవుల సంరక్షణకు తమ ప్రభుత్వం తరపున కూడా సహాయ సహకారాలు కూడా అందజేస్తామన్నారు. పర్యావరణ పరిరక్షణకు పాటుపడిన పలువురిని కొమ్మినేని సత్కరించారు. అనంతరం బయోడైవర్సిటీ సెంటర్, ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆసక్తిగా తిలకించారు. ఏపీ ప్రెస్ అకాడమీ సెక్రటరీ ఎం.బాలగంగాధర్ తిలక్, ఎంపీపీ రాయుడు సునీత, వైఎస్సార్ సీపీ నేతలు దున్నా జనార్దనరావు, కుడుపూడి శివన్నారాయణ, కోరంగి సర్పంచ్ పెయ్యల మంగేష్, ముదునూరి సతీష్‌రాజు, పెన్మెత్స చిట్టిరాజు, పర్యావరణ వేత్త పేరిచర్ల రాజగోపాల్‌రాజు, రాయుడు గంగాధర్, ఉంగరాల వెంకటేశ్వరరావు, కేసరి శ్రీనివాసరావు, సీతారామరాజు, అటవీ అధికారులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని. చిత్రంలో ఎమ్మెల్యేలు కన్నబాబు, పొన్నాడ, అశోక్

కొన్ని పత్రికలు విలువలను కాలరాస్తున్నాయి

రాష్ట్రంలో కొన్ని పత్రికలు జర్నలిజం విలువలను కాలరాస్తున్నాయని కొమ్మినేని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కృషి ఫలితంగా ఏర్పాటైన శ్రీసిటీ విషయంలో ఆ పత్రికలు 2006లో సెజ్‌లకు నజరానా, 2008లో సెజ్ కుంపట్లు అని రాశాయన్నారు. అవే పత్రికలు 2016లో బతుకు మార్చిన భాగ్యసీమ అంటూ కీర్తిస్తూ రాశాయని ఇవి పత్రికా విలువలేనా అని ప్రశ్నించారు. జర్నలిజం మౌలిక సూత్రాలను ఆ పత్రికలు మరిచాయన్నారు. శ్రీ సిటీని ఇటీవల సందర్శించానని, 25 దేశాలకు చెందిన 250 సంస్థలు ఉన్నాయని, వాటి సందర్శన తరువాత వైఎస్సార్‌పై అభిమానం వంద రెట్లు పెరిగిందన్నారు. జర్నలిస్టులు అవాస్తవాలు రాయవద్దని కోరారు.

ఇటీవల ఒక రాజకీయ పార్టీ సభలో తొక్కిసలాట జరిగిన సంఘటనపై పోలీసుల వైఫల్యం అని ఆ పత్రికలు రాశాయని, ఏ విధమైన వైఫల్యాలో ప్రస్తావించకుండానే రాయడం జర్నలిజానికి తగదన్నారు.

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.